క్లుప్తంగా

నిధుల వినియోగంపై తనిఖీ

నాగలాపురం : పిచ్చాటూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు మంజూరు చేసిన నిధులు, వినియోగం, ఖర్చులు, మౌలిక వసతులకు చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై బుధవారం డీఆర్పీ బృందం పిచ్చాటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేపట్టారు. బృందం సభ్యులు డీఆర్పీ రవి, మల్లికార్జున బాబు, మద్దిలేటి, శ్రీనివాసులు, శ్రీకాంత్, మధ్యాహ్న భోజనంను రుచి చూసి పాఠశాలలోని మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ప్రయోగశాల, గ్రంథాలయాలు, అదనపు గదుల నిర్మాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాల కమిటీ సభ్యులు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల నిర్వహణపై తల్లిదండ్రుల అభిప్రాయం సేకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గిరీష్ ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ క్లబ్‌లో టెన్నిస్ పునఃప్రారంభం



టెన్నిస్ కోర్టును పునఃప్రారంభిస్తున్న సభ్యులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని రిపబ్లిక్ క్లబ్ నందు బుధవారం టెన్నిస్ కోర్టును పునఃప్రారంభం చేశారు. రాష్ట్ర స్థాయిలో క్రీడాకారులను అందించిన శ్రీకాళహస్తి రిపబ్లిక్ క్లబ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో రెండు టెన్నిస్ కోర్టులు ఉన్నాయి. రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలకు అనేక ఏళ్లుగా క్లబ్ వేదికగా నిలిచింది. ఈ కోర్టులో క్లబ్ సభ్యులు మాత్రమే కాకుండా నియోజకవర్గంలో టెన్నిస్‌పై ఆసక్తి గల విద్యార్థులకు కోచింగ్ అందించి మంచి క్రీడాకారులుగా తయారు చేసేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఈ క్లబ్ నందు మరెన్నో సాంస్కృతిక కార్యక్రమాలు గతంలో నిర్వహించేవారు. ఈ క్లబ్ తిరిగి పూర్వవైభవం పొందాలంటే మంచి సేవాభావం కలిగిన వారు పాలక మండలికి ఏర్పాటు కావాలని క్లబ్ సభ్యులు భావిస్తున్నారు.

పశు వైద్యశిబిరానికి స్పందన



గొల్లపల్లిలో పశువైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ సునీత

రేణిగుంట : మండలంలోని కరకంబాడి పంచాయతీ గొల్లపల్లిలో బుధవారం రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన లభించింది. మండల పశువైద్యాధికారి డాక్టర్ సునీత, కేవీకే పశువైద్యాధికారి అనూష .. పశువులు, దూడలు, జీవాలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జీవాలకు పురుగుమందులు తాగించి, పిడుదుల నివారణకు మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, గిరిప్రసాద్, జ్యోతి, ఇందుమతి, నాగమణి, అన్బలగన్, శంకరయ్య పాల్గొన్నారు.


సత్యవేడు వైద్యశాల అభివృద్ధి కమిటీ ఏర్పాటు

సత్యవేడు : స్థానిక కమ్యూనిటీ వైద్యశాల కమిటీ చైర్మన్‌గా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపీ గురుమూర్తి , కన్వీనర్‌గా డాక్టర్ సురేష్, సభ్యులుగా హేమభూషణం, దినేష్ కుమార్, మహిళా సభ్యురాలుగా శోభను నియమించారని కమ్యూనిటీ వైద్యశాల డాక్టర్ సురేష్ తెలిపారు.

ఉపాధ్యాయులకు అవగాహన

శ్రీకాళహస్తి : పది , ఇంటర్ తరగతులకు బోధిస్తున్న అధ్యాపక, ఉపాధ్యాయ సిబ్బందికి అంబేడ్కర్ గురుకులంలో బుధవారం ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త గీత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. లాంగ్వేజెస్‌లో వంద శాతం ఫలితాలు, అత్యధిక సగటు స్కోర్ కోసం చేపట్టాల్సిన వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు. పదో తరగతిలో హిందీలో ఎక్కువ మార్కులు పొందేందుకు ఉపాధ్యాయులకు విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ గుప్తా పలుసూచనలు ఇచ్చారు. ఫలితాల సాధనలో ఒత్తిడిని అధిగమించి ఉపాధ్యాయులు ముందుకు సాగాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ గోపి తమ విలువైన సూచనలతో అందరినీ చైతన్యపరిచారు. సమావేశంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తమిళనాడు ఎస్‌ఐ రాజేంద్రన్ మృతి



నాగలాపురం: పిచ్చాటూరు గ్రామానికి చెందిన ఎస్‌ఐ రాజేంద్రన్ బుధవారం మృతి చెందారు. రాజేంద్రన్ తమిళనాడులోని ఊతుకోటైలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. పిచ్చాటూరు స్మశాన వాటికలో పోలీసు లాంఛనాలతో రాజేంద్రన్ అంత్యక్రియలు నిర్వహించారు.

ఎదురుచూపులు



టార్పాలిన్‌లు లేక అద్దెకు తెచ్చుకొన్న పట్టలో ఆరబెడుతున్న వడ్లు



తడిసిన వడ్లను సాధారణ పట్టలో ఎండబెడుతున్న రైతు

- టార్పాలిన్‌లు అందక రైతన్నల అగచాట్లు
- కోతలు జరిగే సమయంలో అందిస్తేనే మేలు
- సకాలంలో అందించాలని వేడుకోలు

విపత్తుల సమయంలో అన్నదాతలు పంటలను కాపాడుకునేందుకు టార్పాలిన్ పట్టాలు ఎంతో అవసరం. వాటిని ప్రభుత్వం రాయితీతో అందించాల్సి ఉంది. కానీ అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు రాకపోవడంతో పంటలు కోతకు వచ్చే సమయంలో అందించలేకపోతున్నారు. సకాలంలో అందించకపోతే రైతులకు జరగాల్సిన నష్టం అప్పటికే జరిగిపోతోంది.

– సత్యవేడు

డిసెంబరులో వచ్చిన తుపాన్లు, జనవరిలో కురిసే వర్షాలు రైతులను తీవ్రంగా నష్టం కలిగించాయి. వాటి నుంచి పంటలను కాపాడుకునేందుకు టార్పాలిన్‌లు అవసరం. రైతుల కష్టాలు తీర్చేలా రాయితీపై టార్పాలిన్‌లు పంపిణీ చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. మిరపతో పాటు ఇళ్ల వద్ద ఆరబెట్టుకునే వడ్లు, రాగులు, సజ్జ గింజలను కాపాడుకునేందుకు పట్టలు అవసరం అవుతాయి. వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం రాయితీపై చాలా కాలంగా పంపిణీ చేస్తున్నారు.

వేల ఎకరాల్లో వరి సాగు

సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో ఒక్కో మండలంలో 4 నుంచి 6 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. కోతలు చాలా చోట్ల ప్రారంభమయ్యాయి. నూర్పిడికి ముందు పంటను కాపాడుకునేందుకు టార్పాలిన్‌లు అవసరం. ప్రస్తుతం ఎకరా పొలంలో పంటను కాపాడుకునేందుకు 30 అడుగుల పొడవు, 30 అడుగులు వెడల్పు ఉన్న రెండు టార్పాలిన్‌లు కావాల్సి ఉంది. అయితే వీటిని రైతులు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తే రూ.3 వేలు నుంచి 4 వేలు వెచ్చించాల్సి వస్తోంది. ప్రభుత్వం పంపిణీ చేసేంత నాణ్యత లేవు. అదే ప్రభుత్వం అందించే టార్పాలిన్‌లు అందిస్తే అయిదారేళ్లు మన్నిక వస్తాయని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాలకు అన్నదాతలు వెళ్లి తమకు టార్పాలిన్‌లు కావాలంటూ అడుగుతున్నారు. ప్రభుత్వం నుంచి పంపిణీపై ఇంకా మార్గదర్శకాలు రాలేదని సమాధానమిస్తున్నారు.

మార్కెట్‌లో ధర అధికం



మార్కెట్‌లో విక్రయిస్తున్న టర్పాలిన్‌ల ధర రూ.3 వేలు వరకు ఉంటోంది. అయినా నాణ్యత లేవు. గతంలో ప్రభుత్వం సబ్సిడీలో సరఫరా చేసిన పట్టలు అయిదేళ్ల వరకు బాగా వాడుకున్నాం. ప్రస్తుతం ఉన్న పట్టలు దెబ్బతిన్నాయి. రాయితీతో పట్టలు రైతులకు ఇస్తే కొలు రైతులకు ఎంతో ప్రయోజనం.

- డి.పన్నీరు సెల్వం, కాళమనాయుడుపేట

అవసరానికి అద్దెకు తెచ్చుకుంటున్నాం



సత్యవేడులో పట్టలు అద్దెకు ఇస్తున్నారు. పంట కోసినప్పుడు వర్షాలకు తడకుండా పట్టలు తెచ్చుకుంటున్నాం. నాలుగు రోజులు ఉంచుకుంటే రూ.400 చెల్లించాల్సి వస్తోంది. సగం డబ్బులు వీటికే ఖర్చు అయిపోతున్నాయి. సకాలంలో అందించకపోతే ఉపయోగం ఉండదు. **- వి.విల్సన్, కేఎన్.పేట, సత్యవేడు**

పంట కోతల సమయం



మండలంలోని సన్న, చిన్నకారు, రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో నాణ్యమైన రకం టార్పాలిన్‌లు అందించాలి. పంట కోతల అనంతరం అందిస్తే రైతులకు ఏం ఉపయోగం ఉండదు.ఈనెలలోనే పట్టలు రైతులకు అందించేందుకు ప్రభుత్వం చొరవ చూపితే రైతులకు ఎంతో మేలు.

- ఆనంద్ కాళమనాయుడుపేట

రేపు ఉద్యోగమేళా

శ్రీకాళహస్తి : పట్టణంలో గవర్నమెంట్ మహిళా డిగ్రీ కళాశాల నందు జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఉద్యోగమేళాలో బహుళ జాతీయ కంపెనీలైన అమర రాజా కంపెనీ, వీల్స్ ఇండియా, డైకిన్ ఎయిర్ కండీషనింగ్ ఇండియా, అపాచీ ఫుట్‌వేర్ ఇండియా మొదలగు కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్ , ఐటీఐ , డిప్లొమా , ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత అయిన యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువత ఆధార్ జిరాక్స్ , విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాల జిరాక్స్ , బయోడేటా ఫామ్‌తో పాటు, జాబ్‌కార్డ్‌తో ఉద్యోగమేళాకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.ఉషారాణిని సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 89855 53125, 94948 01211 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బాలికల భద్రత బాధ్యత



పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి : ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రో చైల్డ్‌గ్రూప్ , చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫోరం ఆధ్వర్యంలో డీఎస్పీ నరసింహమూర్తి చేతుల మీదుగా బాలికల భద్రతపై అవగాహన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నారాయణ మాట్లాడుతూ.. బాలికల బంగారు బాల్యాన్ని కాపాడడం అందరి బాధ్యత అన్నారు. ఈనెల 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య, రమేష్, ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్లు జయలక్ష్మి, సుభాష్ చంద్రయ్య, ప్రభాకర్, సిబ్బంది రామచంద్ర పాల్గొన్నారు

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



మహిళలకు పరీక్షలు చేస్తున్న స్విమ్స్ వైద్యులు

నారాయణవనం : క్యాన్సర్‌పై అవగాహన పెంచుకొని సకాలంలో చికిత్సలు చేసుకోవాలని వైద్యులు సూచించారు. బుధవారం మండలంలో వెంకటకృష్ణపాళ్యం, కసిమ్మిట్ట విలేజ్ క్లినిక్‌లలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను స్విమ్స్ వైద్యులు నిర్వహించారు. పింక్ బస్సులో నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మమోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాగసుధ, స్విమ్స్ వైద్యాధికారులు హరిత, చైతన్య భాను మాట్లాడుతూ.. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం అవసరమన్నారు. అవగాహన లేకపోవడంతోనే ముఖ్యంగా మహిళలు క్యాన్సర్ బారీన పడుతున్నారన్నారు. గురువారం భీమునిచెరువు, నారాయణవనం-3 సచివాలయాల పరిధిలో రెండు పింక్ బస్సుల్లో స్క్రీనింగ్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఎరికంబట్టు, నారాయణవనం-2 సచివాలయాల వద్ద, 27న సోమవారం కొండలచెరువులో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హాస్టళ్లకు అన్ని వసతులు కల్పిస్తాం

- జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్



కళాశాల వసతి గృహంలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి : బాలికలు ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునేలా సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతిగృహంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని, బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలో సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ వసతి గృహాలకు దీటుగా ఆదర్శ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాలను తీర్చిదిద్దుతామన్నారు. మరుగుదొడ్లు, డైనింగ్ తదితర పనులను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మరమ్మతులు చేయించడం అభినందనీయమన్నారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం వారికి కావాల్సిన కంప్యూటర్లు, బెడ్లు, వాష్ ఏరియా, 24 గంటల ఇంటర్నెట్ సదుపాయం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని విద్యార్థులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లాలోని హాస్టళ్ల మరమ్మతులకు రూ.6 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. జిల్లాలోని హాస్టళ్లలో అన్ని వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండు నెలల్లో హాస్టల్‌లోని వసతులను చక్కదిద్దామని తెలిపారు. ఇప్పటికే నాలుగు హాస్టళ్లకు మరమ్మతులు చేయడం జరిగిందని, మిగిలిన మూడు హాస్టళ్లను కూడా ఇదే విధంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య , ఆలయ ఈఓ బాపిరెడ్డి , ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహం బాలికల వార్డెన్లు పాల్గొన్నారు.

మండల సభలో అధికారుల నిలదీత



సమస్యలు ఏకరువు పెడుతున్న సభ్యులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండల సమావేశాల్లో లేవనెత్తిన ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదని, మండల సమావేశాలు ఇంకెందుకని అధికారులను సభ్యులు నిలదీశారు. బుధవారం వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరయ్యారు. సమావేశంలో సభ్యులు గ్రామాల్లోని సమస్యలు ఏకరువు పెట్టారు. సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది పనితీరు బాగోలేదని, సమయపాలన పాటించడంలేదని, వారిపై అధికారుల పర్యవేక్షణ లేదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. పార్టీలు, కులాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సర్పంచ్‌లు గ్రామాల్లోని తాగునీటి ట్యాంకుల్లో తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలని తెలిపారు. మండలంలో 943 పక్కా గృహాలు నిర్మాణంలో ఉండగా 609 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లు త్వరితగతిన పూర్తి చేస్తామని హౌసింగ్ ఏఈ గోపి తెలిపారు. కాటూరు గ్రామ దళితవాడలో శ్మశానం లేకపోవడంతో చెరువు కట్టపై శవాలను పూడ్చుతున్నారని, శ్మశానానికి స్థలం కేటాయించాలని పలు సమావేశాల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఎంపీటీసీ సభ్యుడు రవి అన్నారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనరు అరణివిద్యానాథరెడ్డి, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, తహసీల్దారు సుబ్రమణ్యం, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నియామకం

వరదయ్యపాళెం : సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు నూతన అధ్యక్షులను నియమింపజేస్తూ బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడిగా ఎం.వినోద్ కుమార్ (వరదయ్యపాళెం), మహిళా విభాగానికి ఎస్‌కే. మస్తానీ (సత్యవేడు), రైతు విభాగం పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి (వరదయ్యపాళెం), బీసీ సెల్ విభాగం దేవేళ్ల మహేంద్రుడు (వరదయ్యపాళెం), ఎస్సీ సెల్ విభాగం దుడ్డు వేణు (వరదయ్యపాళెం), ఎస్టీ సెల్ విభాగం పోలయ్య (వరదయ్యపాళెం), మైనారిటీ సెల్ విభాగం సాబుద్దీన్ (నాగలాపురం), విద్యార్థి విభాగం మునిరాజ (బీఎన్‌కండ్రిగ), లీగల్ సెల్ విభాగం పద్మనాభరెడ్డి (కేవీబీపురం), వైఎస్సార్ టీయూసీ గోవిందస్వామి (సత్యవేడు), ఐటీ వింగ్‌కు చంద్రశేఖర్ (కేవీబీపురం), వీవర్స్ వింగ్‌కు ఎన్. సుబ్రమణ్యం (నారాయణవనం), గ్రీవెన్స్ సెల్‌కు శ్రీధర్‌రెడ్డి (సత్యవేడు), పంచాయతీరాజ్ విభాగానికి గిరిధర్ రెడ్డి (వరదయ్యపాళెం), వలంటీర్స్ విభాగానికి రమేష్‌రాజు (పిచ్చాటూరు), అంగన్‌వాడీ విభాగానికి కల్పన విజయ్‌కుమార్ (నాగలాపురం), దివ్యాంగుల విభాగానికి దేవదాసురెడ్డి (బీఎన్‌కండ్రిగ), కల్చరల్ విభాగానికి మునిరాజ (పిచ్చాటూరు), ఆర్టీఐ విభాగం రవీంద్ర రెడ్డి (బీఎన్‌కండ్రిగ), వాణిజ్య విభాగం భూపతి (పిచ్చాటూరు), క్రిస్టియన్ మైనారిటీ సెల్‌కు రాజమణి (నాగలాపురం), డాక్టర్స్ వింగ్‌కు ధనపాల్ (సత్యవేడు), ఇంటిలెక్చువల్స్ ఫోరమ్ విభాగానికి మోహన్ (నాగలాపురం), సోషల్ మీడియా విభాగానికి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి (సత్యవేడు), బూత్ కమిటీ విభాగాలకు బందిల సురేష్ (వరదయ్యపాళెం), ప్రచార విభాగానికి శివ యాదవ్ (వరదయ్యపాళెం) నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులయ్యారు.

పొంచి ఉన్న ముప్పు

- రేణిగుంటకు సమస్యగా పందుల బెడద
- సీజనల్ వ్యాధులతో జనం బెంబేలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



రేణిగుంట వీధుల్లో వరాహాల సమూహం



ఇళ్ల మధ్య మురుగు కాలువలో పందులు ఇలా..

రేణిగుంట : రేణిగుంట.. మున్ముందు మున్సిపాలిటీ హోదా పొందనున్న చిన్నపాటి పట్టణం.. తిరుపతి పుణ్యనగర శివారున ఉన్న మండల కేంద్రం. అయితే అభివృద్ధిని అటుంచితే దశాబ్దాల తరబడి స్థానికులను వేధిస్తున్న ప్రధాన సమస్య ఒక్కటే. అదే పందుల బెడద... రేణిగుంటలో ఉన్నన్ని పందులు జిల్లాలో మరెక్కడా లేవని అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. దీంతో రేణిగుంటలో ఏ వీధిలో చూసినా అపరిశుభ్రమైన వాతావరణ పరిస్థితులే కనిపిస్తాయి. తత్ఫలితంగా ఆరోగ్య పరిరక్షణ స్థానిక ప్రజానీకానికి పెను సవాలుగా మారింది. ఈ సమస్యపై పంచాయతీ అధికారుల నియంత్రణ చర్యలు శూన్యం.

రేణిగుంటలోని పాంచాలీనగర్, వేణుగోపాలపురం, చెక్‌పోస్టు పరిసరాలు, భగత్‌సింగ్ కాలనీ, వినాయకనగర్, వడ్డిమిట్ట, పీహెచ్‌సీ ప్రాంతం, జ్యోతినగర్, అంబేడ్కర్ కాలనీ, బుగ్గవీధి, ఎస్ఎన్‌పురం, ఏఎస్ఆర్ కాలనీ, బిస్మిల్లానగర్, ఎల్లమండ్యం వంటి ప్రాంతాల్లో సుమారు రెండు వేలకు పైగా ఉంటాయని అంచనా. అయితే వాటి నియంత్రణకు అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలే స్థావరాలు

ఇళ్ల మధ్య నున్న ఖాళీ స్థలాలే పందులు స్థావరాలుగా చేసుకుని జనావాసాల మధ్య సంచరిస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది చెత్త నిల్వలు సక్రమంగా ఎత్తక పోవడంతో పేరుకుపోయిన చెత్త నిల్వల్లో పందులు పడి దొర్లుతున్నాయి. ఇళ్ల మధ్య నున్న ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలు, గుంతలకు తావు లేకుండా స్థల యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి. లేని పక్షంలో పంచాయతీ అధికారులే పరిశుభ్రంగా ఉంచాలి. అయితే ప్రతి వీధిలోనూ ఇళ్ల మధ్య మురుగు చేరి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దీనికితోడు పందుల బెడదతో నిత్యం రేణిగుంటలో దుర్గంధం వెదజల్లుతూ రోగాల వ్యాప్తికి కారణమవుతున్నాయి.

పెంపకందార్లతోనే అసలు సమస్య

రేణిగుంటలోని కొందరు పందుల పోషణపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరు పందులను వీధుల్లో వదిలిపెట్టడంతో అసలు సమస్య ఏర్పడుతోంది. మురుగునీటి గుంతల్లో పొర్లాడిన పందులు వీధుల్లో చెత్త కుప్పల వద్దకు చేరి ఆహార సేకరణ చేస్తాయి. పంచాయతీ అధికారులు చెత్తను ప్రతిరోజూ తొలగించకపోవడంతో కొన్నిచోట్ల దుర్గంధం వెదజల్లుతూ అంటువ్యాధులు ప్రబలుతున్నాయి.

రోగాలు తప్పడం లేదు

రేణిగుంట పట్టణంలో పరిసరాలు మురికి కూపంగా మారడమే కాకుండా దుర్గంధభరితమైన వాతావరణం చోటుచేసుకుంది. పంచాయతీ అధికారులు పందుల నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇళ్ల మధ్య నున్న ఖాళీ స్థలాల్లో మురుగు నిల్వల్లోనే పందులు సంచరిస్తున్నాయి. చిన్న పిల్లలు ఉన్న ఇళ్లలోకి కూడా వస్తున్నాయి. రేణిగుంట ప్రజల ఆరోగ్య అంశంతో ముడిపడి ఉన్న ఈ సమస్య పరిష్కారానికి అధికారులు పట్టించుకోవడం లేదు. **- హరినాథ్, రేణిగుంట**

నివారణకు చర్యలు

రేణిగుంటలో పందుల నివారణకు ఇప్పటికే పలుమార్లు పెంపకందారులకు నోటీసులిచ్చి పట్టుకున్నాం. పందుల వల్ల రేణిగుంటలో అపరిశుభ్రమైన పరిస్థితులు తలెత్తటంపై ఫిర్యాదులొస్తున్నాయి. కట్టడికి పటిష్ఠ చర్యలు తీసుకుంటాం.

- విష్ణు చిరంజీవి, ఎంపీడీవో, రేణిగుంట

జోరుగా వరి కోతలు



పెద్ద పాండూరులో వరికోత ..

వరదయ్యపాళెం : మండలంలో వివిధ ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ముందుగా సాగు చేసుకున్న వరి పంటను మండలంలోని చిలమత్తూరు, సీఎల్ఎన్ పల్లి, అంబూరు, వరదయ్యపాళెం, తొండంబట్టు, చిన్న పాండూరు, పెద్ద పాండూరు ప్రాంతాలల్లో వరికోతలు జోరుగా సాగుతున్నాయి. దీంతో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. మండల పరిధిలో ప్రస్తుతం రబీ సీజన్‌కు 4,020 హెక్టార్లలో వరి పంటను సాగు చేసినట్లు అధికారుల సమాచారం. ఈ నెలాఖరు వరకు వరి కోతలు జరగనున్నట్లు రైతులు చెబుతున్నారు.